# దినదిన గండం

పూ. భా.

విల్సు సిగరెట్టు—బ్లాక్ మార్కెట్‌లో మూడు కాన్లిచ్చి కొన్నది.....ధరలు హెచ్చాయని అప్పుడే పత్రికల్లో వార్త.....అప్పుడే ముట్టించి ఒక్క పీల్పే పీల్చాను. ఆ సమయానికే రావాలి ఆఫీసరు? ఎదురుగుండా కూర్చున్న మరోగుమస్తా "పారేయ్...పారేయ్" అన్నాడు. నాకు చాలా కష్ట మనిపించింది...కాదూ మరి......ఎంత కష్ట పడ్డాను మొదట్రోజుల్లో...

అసలీ సిగరెట్టు కాల్చడానికి శ్రీ కాకుళంలో మూడో ఫారం చదువుతూన్నప్పుడు విఘ్నేశ్వర పూజ చేసాను. అమ్మకి తెలియకుండా నాన్న దగ్గిరా, నాన్నకి తెలియకుండ అమ్మదగ్గిరా పుచ్చుకున్న డబ్బులూ, అనవసరం పుస్తకాల పేర్లతో పుచ్చుకున్న అన్యాయం డబ్బులూ, మహాలక్ష్మి పీటలోనూ, ఆవాలడబ్బాలోనూ అమ్మ దాచుకున్న డబ్బులూ పెట్టి బేర్సు సిగరెట్లు కొనేవాణ్ణి. అప్పటికి నాకదే మంచి సిగరెట్టుగా కనిపించింది. కాని అవి కాల్చేసరికి తాతలు దిగేవారు. కాల్చేందుకు సరియైన ప్రదేశం దొరికేది కాదు. అక్కడా యిక్కడా కాలిస్తే ఏ గుంటడేనా చూసి యింటి దగ్గర చెప్పేస్తాడేమోనని భయం, స్కూలు మేష్టరు చూస్తే తంతాడనే భయం, నాగావళి ఒడ్డునున్న బండరాయి దగ్గరకిపోయి కాల్చుకుందామా అంటే దెయ్యాలుమీద పడతాయనే భయం, ఇంక కోటీశ్వరాలయానికి వెనుక నున్న శిథిలాలయంలోకి పోయి కాల్దామా అంటే నలుగురూ అనుమాన పడతారనే భయం (ఎందు కనుమానం? అని మీకు సందేహం కలిగితే మీ శ్రీకాకుళం మిత్రుణ్ణడగండి) పోనీ సినీమాకిపోయ స్వేచ్ఛగా కాల్దామాఅంటే నేను బయల్దేరినప్పుడల్లా మాబావకూడా తయారయేవాడు. అందుకే వాడికీ నాకూ ఎప్పుడూ పడేదికాదు...ఇన్ని భయాలచేత ఒక్క సిగరెట్టు కాల్చేసరికి ఒక సామ్రాజ్యాన్ని గెలిచినట్టయేది.

ఇంక కొన్న సిగరెట్లు యింటికి తెసే ఒళ్ళు వాచిపోతుందన్న భయంచేత, మర్నాడు తీసుకుందామని అక్కడా యిక్కడా దాచేవాణ్ణి. కాని మర్నాడు చూసేసరికి అప్పుడప్పుడు కనుపించేవి కావు. ఇటువంటి మహోత్కృష్టకష్టాలుపడి అలవాటు చేసుకున్న సిగరెట్టుని ఎలా పారేయగలను చెప్పండి?

ఏమైతేనేం మరి పారేయకూడదని నిశ్చయించుకున్నాను. ఇటువంటి ప్రమాదం సంభవించడం యిదే మొదటిసారి. ఆఫీసరు మీదనుండేవాడు. మా గుమాస్తా మాత్రులమంతా క్రిందనుండే వాళ్ళం. ఎన్ని సిగరెట్లు కాల్చినా, ఎన్నిసార్లు కాఫీ తెప్పించుకున్నా, ఎన్ని కిళ్లీలు నమిలినా, యెంతిమంది స్నేహితులతో బాతాఖానీ కొట్టినా అడ్డుండేది కాదు. హెడ్‌క్లార్కున్నాడూ అంటే అతనికో కప్పు కాఫీ, ఒక సిగరెట్టుతో మొగం ఝుమాయించేసేది. అయినా హెడ్‌క్లార్కంటె పెద్ద బావగారితో సమానమైనవాడు.

కాని యీ మధ్యనే...ఆఫీసరుగార్కి ఏం బుద్ధి పుట్టిందో అమాంతంగా మమ్మల్ని మేడెక్కించేసారు. అప్పట్నుంచీ అనుకుంటూనే ఉన్నాను ఏదో ఒక సుముహూర్తాన దొరికిపోతానని.

ఆఫీసరు వచ్చాడు. సిగరెట్టున్న ఎడంచెయ్యి టేబిల్ క్రిందపెట్టి లేచి సగౌరవంగా విష్‌చేసాను. చిన్న చిన్న పొగలు నోట్లోంచి రావడం చూసి "కూచో...కూచో...పూర్తిగాకాల్చిందీపారెయ్యకు" అన్నాడు చిరునవ్వుతో.

దాంతో షాక్ కొట్టినట్టయిపోయింది. కాదూ మరి? ఎదురుగుండా సిగరెట్టు కాలుస్తున్న గుమస్తాను చూసి ఊరుకోవడమే కాకుండా ప్రోత్సహించిన ఆఫీసర్ని, అందులో నూ ఆఫీసులో-మీరు చూసారా?

Published by M. S. Murthy at 12, Thambu Chetty Street, Madras, and
Printed by B. Nagi Reddi at B. N. K. Press, 43, Acharappan Street, Madras.
*Joint Editors: V. KALIDAS & M S. MURTHY.*